RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక
నేటి ప్రసాదం తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు
తెలుగు రాష్ట్రాల్లో
విలేకరులు కావలెను.
వివరాలకు సంప్రదించండి:
+91 90004 05386

హైదరాబాద్ | బుధవారం 7-10-2026 | సంచిక: 13 | సంఖ్య: 349 పేజీలు: 8 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి

## నోటీసులు ఒకరి నుంచి..
# ఇంటి నంబర్లు మరొకరి నుంచి!

మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్లపోచంపల్లి డివిజన్ బాసిరేగడిలో అధికారుల తీరుపై తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకే ప్రాంతంలో అనుమతులు లేని నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేస్తుండగా.. అదే నిర్మాణాలకు రెవెన్యూ శాఖ నుంచి ఇంటి నంబర్లు ఎలా కేటాయించబడ్డాయన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. బాసిరేగడిలో ఓ వ్యాపారి తన వ్యాపార అవసరాల కోసం భారీ షెడ్ల నిర్మాణం చేపట్టినట్లు సమాచారం. అవసరమైన అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారంటూ టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. అయితే నోటీసులు జారీ చేసిన కొద్ది రోజులకే అదే నిర్మాణాలకు ఇంటి నంబర్లు రావడం పలు అనుమానాలకు తావిస్తోంది. టౌన్ ప్లానింగ్ శాఖ దృష్టిలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణానికి రెవెన్యూ శాఖ ఇంటి నంబర్ ఎలా కేటాయించింది? అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.



3లో

నేటి ప్రస్థానం ప్రతినిధి, మేడ్చల్

## ఎర్రవల్లి భూములపై
# సీఎం రేవంత్ సమీక్ష

- ం సర్వేలో 45 ఎకరాల భూమి తేడా ఉన్నట్టు గుర్తింపు
- ం రికార్డులు సమర్పించాలని కేసీఆర్ కుటుంబానికి నోటీసులు
- ం అదే భూమిలో అమరవీరుల కాలనీ నిర్మాణానికి ఆదేశం
- ం జూన్ 2 నాటికి నిర్మాణం పూర్తి చేయాలని అధికారులకు సూచన

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాల భూముల సర్వే నివేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఎర్రవల్లిలోని సర్వే నంబర్ 325లో రెవెన్యూ రికార్డుల ప్రకారం 388 ఎకరాలు ఉండగా, క్షేత్రస్థాయి సర్వేలో కేవలం 343 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. దీంతో గల్లంతైన 45 ఎకరాల భూమి ఎక్కడుందో వెంటనే గుర్తించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ భూమిని గుర్తించేందుకు ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాలకు సర్వే నోటిఫికేషన్లు జారీ చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా, సంబంధిత రెవెన్యూ రికార్డులను

- మిగతా 2వ పేజీలో





2లో

## భారత వాయుసేన నూతన
# అధిపతిగా అశుతోష్ దీక్షిత్

- ప్రస్తుతం వైస్ చీఫ్‌గా ఉన్న దీక్షిత్‌కు పదోన్నతి
- అక్టోబర్ 31న పదవీ విరమణ చేయనున్న అమర్ ప్రీత్ సింగ్
- 3,500 గంటలకు పైగా ఫైటర్ జెట్ నడిపిన అనుభవం
- త్రివిధ దళాల సమన్వయం, ఆధునికీకరణపై దృష్టి

# ఢిల్లీ ఆకాశవాణి భవన్ వద్ద ఉద్రిక్తత

- ం పోలీసుల అదుపులో రాహుల్ గాంధీ, ప్రియాంక..
- ం సీఈసీ రాజీనామా కోరుతూ ఢిల్లీలో విపక్షాల భారీ నిరసన
- ం పార్లమెంట్ నుంచి ఈసీ కార్యాలయానికి ఇండియా కూటమి ర్యాలీ
- ం బారికేడ్లు ఎక్కి నిరసన తెలిపిన రాహుల్ గాంధీ
- ం రాహుల్, ప్రియాంక, అఖిలేశ్ సహా పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ం ఆకాశవాణి భవన్‌లో బైఠాయించి కొనసాగుతున్న ఆందోళన

దేశ రాజధాని ఢిల్లీ మంగళవారం విపక్షాల ఆందోళనతో దద్దరిల్లింది. ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'ఇండియా' కూటమి చేపట్టిన నిరసన కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు, హైడ్రామాకు దారితీసింది.



- మిగతా 2వ పేజీలో



# సీఎం, డిప్యూటీ సీఎం బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్..

- ం స్థానిక పోరుపై చంద్రబాబు, పవన్ మంతనాలు
- ం ముఖ్యమంత్రి చంద్రబాబుతో పవన్ కల్యాణ్ భేటీ
- ం స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహంపై ప్రధాన చర్చ
- ం శక్తిసామర్థ్యాల ఆధారంగానే సీట్ల పంపకంపై నిర్ణయం
- ం బీసీ రిజర్వేషన్లపై సుప్రీం తీర్పు తర్వాతే ఎన్నికల షెడ్యూల్
- ం వైసీపీకి ఒక్క స్థానం దక్కకుండా చూడాలనే పట్టుదల

2లో

రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మధ్య కీలక సమావేశం జరిగింది. మంగళవారం ఉదయం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి పవన్ కల్యాణ్ చేరుకున్నారు. ఈ సందర్భంగా పవన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ స్వాగతం పలికారు.

# రాష్ట్రంలో సరికొత్త రికార్డు స్థాయికి విద్యుత్ డిమాండ్

- ం కరెంట్ డిమాండ్‌లో బిగ్ రికార్డ్.. 20 వేల మెగావాట్లకు చేరిక.!
- ం పులిచింతల పవర్ ప్లాంట్‌ను పరిశీలించిన భట్టి విక్రమార్క
- ం ఎల్‌నినో ప్రభావంతో 4 వేల మెగావాట్ల జలవిద్యుత్ తగ్గుదల
- ం విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేస్తున్న సంస్థలు





2లో

# మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలి

- + ఈ నెల 17న అంబర్‌పేటలో బతుకమ్మ సంబరాలకు పిలుపు
- + మహిళా శక్తికి బతుకమ్మ ప్రతీక అన్న కిషన్ రెడ్డి
- + మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారని ప్రశంస
- + డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం నవంబర్‌లో పాదయాత్ర

## స్థానిక సంస్థల్లో 34 శాతం బీసీ కోటా..
# సుప్రీంకోర్టులో గెలుస్తాం

- + ఢిల్లీలో న్యాయ నిపుణులతో చర్చలు జరిపిన టీడీపీ నేతలు
- + బీసీలంటే వైసీపీకి ఎందుకంత వ్యతిరేకత అని రామ్మోహన్ నాయుడు ప్రశ్న
- + బీసీలకు రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని మండిపాటు

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు సుప్రీంకోర్టులోనూ పూర్తి అవకాశం ఉందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ధీమా వ్యక్తం చేశారు.

- మిగతా 2వ పేజీలో



## ఎర్రవల్లి భూములపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష...

(మొదటి పేజీ తరువాయి)

సమర్పించాలంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబానికి నోటీసులు ఇవ్వాలని స్పష్టం చేశారు. సర్వే నంబర్ 325లోని భూమిని అమరవీరుల కుటుంబాల కోసం కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. అక్కడ 'అమరవీరుల కాలనీ' నిర్మించి, వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని సూచించారు. ఈ నిర్మాణ బాధ్యతలను హౌసింగ్ బోర్డుకు అప్పగిస్తూ, జూన్ 2వ తేదీ నాటికి పూర్తి చేయాలని గడువు విధించారు. మాజీ సీఎం కేసీఆర్‌కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసరాల్లోని ప్రభుత్వ అసైన్డ్ భూములపై సమగ్ర విచారణ జరపాలని గతంలో అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ ఆదేశాల మేరకే రెవెన్యూ అధికారులు ఇటీవలి వారాల్లో ఈ ప్రాంతంలో సర్వే నిర్వహించి, నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు.

## ఢిల్లీ ఆకాశవాణి భవన్ వద్ద ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)



కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో విపక్ష ఎంపీలు పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం 'నిర్వాచన్ సదన్' వైపు నిరసన ర్యాలీగా బయలుదేరారు. అయితే, ఆకాశవాణి భవన్ సమీపంలో పోలీసులు భారీ బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, నేతలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో రాహుల్ గాంధీ బారికేడ్లు ఎక్కి, చేతిలో జాతీయ జెండాను ప్రదర్శిస్తూ తన నిరసనను తీవ్రతరం చేశారు. అనంతరం ఇతర నేతలతో కలిసి రోడ్డుపైనే బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఢిల్లీ పోలీసులు రంగప్రవేశం చేసి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, టీఎంసీ, శివసేన (యూబీటీ) సహా పలువురు విపక్ష ఎంపీలను అదుపులోకి తీసుకుని బస్సుల్లోకి ఎక్కించారు. ఓటర్ల జాబితాల సవరణలో పారదర్శకత లోపించిందని, అవకతవకలు జరుగుతున్నాయని విపక్షాలు గత కొద్ది వారాలుగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నాయి. ఈసీలో అంతర్గత విభేదాలు ఉన్నాయని కూడా వార్తలు వచ్చాయి. దీనిపై రాహుల్ సోషల్ మీడియాలోనూ స్పందించారు. "జ్ఞానేశ్, ఇక ముగిసింది. రాజీనామా చేయాల్సిన సమయం వచ్చింది" అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

## స్థానిక సంస్థల్లో 34 శాతం బీసీ కోటా..
## సుప్రీంకోర్టులో గెలుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఈ లక్ష్యంతోనే ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిందని తెలిపారు. ఢిల్లీలో ఈరోజు న్యాయనిపుణులతో అచ్చెన్నాయుడు, అనగాని సత్య ప్రసాద్, పార్థసారథి, రామ్మోహన్ నాయుడు చర్చలు జరిపారు. అనంతరం మీడియాతో రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ వైసీపీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బీసీలంటే వైసీపీకి ఎందుకంత వ్యతిరేకత అని ప్రశ్నించారు. వారికి రిజర్వేషన్లు దక్కకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. 34 శాతం కోటాను పునరుద్ధరిస్తే బీసీలకు సుమారు 16,800 పదవులు దక్కుతాయని... ఇది రాజకీయ అంశం కాదని, సామాజిక న్యాయానికి సంబంధించిన విషయమని స్పష్టం చేశారు. కొన్ని రాష్ట్రాలు బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చే మార్గాలను అన్వేషిస్తున్నాయని, ప్రభుత్వం కూడా సమస్యను జటిలం చేయకుండా పరిష్కారం కోసం చూస్తోందని వివరించారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం చట్టాన్ని సవరించకుండానే రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి ఎందుకు తగ్గించిందని నిలదీశారు. దీనివల్ల వేలాది మంది బీసీ నేతలు పదవులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 1987లో టీడీపీనే బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించిందని, ఆ తర్వాత చంద్రబాబు హయాంలో దాన్ని 34 శాతానికి పెంచారని గుర్తుచేశారు.

## రాష్ట్రంలో సరికొత్త రికార్డు స్థాయికి విద్యుత్ డిమాండ్

సూర్యాపేట జిల్లాలోని పులిచింతల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సందర్శించారు. ఈ సందర్భంగా ప్లాంట్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని, ఇప్పటివరకు జరిగిన విద్యుత్ ఉత్పత్తి వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం యూనిట్ కంట్రోల్ రూమ్‌ను స్వయంగా పరిశీలించిన డిప్యూటీ సీఎం, ప్రాజెక్టు నిర్వహణ, విద్యుత్ ఉత్పత్తి తీరుపై అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్రంలో విద్యుత్ వినియోగం అనూహ్యంగా పెరిగి సరికొత్త రికార్డులను తాకుతోందని తెలిపారు. గతంలో ఇదే సమయంలో రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ (పీక్ డిమాండ్) 15,000 మెగావాట్లుగా ఉండగా, ప్రస్తుతం అది ఏకంగా 20,000 మెగావాట్లకు చేరుకుందని వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావం, తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా జల విద్యుత్ ఉత్పత్తి సుమారు 4,000 మెగావాట్ల మేర తగ్గిందని, పెరిగిన డిమాండ్ , తగ్గిన ఉత్పత్తిని కలిపి విద్యుత్ వ్యవస్థపై మొత్తంగా 8,000 మెగావాట్ల అదనపు భారం పడిందని వివరించారు. వ్యవస్థపై ఇంతటి భారీ భారం పడినప్పటికీ, రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా సమర్థవంతంగా నిర్వహణ సాగిస్తున్నామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ముఖ్యంగా గృహ వినియోగదారులకు 24 గంటల పాటు ఎలాంటి అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామని చెప్పారు. జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గినా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విద్యుత్‌ను సమకూర్చుకుంటూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సంస్థలు అత్యంత సమర్థవంతంగా పనిచేస్తున్నాయని భట్టి విక్రమార్క అభినందించారు.

# మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలి

హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో నిర్వహించిన మహిళా సదస్సులో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ నెల 17వ తేదీ శనివారం సాయంత్రం 5 గంటలకు అంబర్‌పేట ప్రాంత ప్రజలంతా కులమతాలకు అతీతంగా బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ప్రకృతిని పూజిస్తూ అందరూ కలిసికట్టుగా ఆడుకునే ఈ పండుగ మన పూర్వీకుల సంస్కృతికి, మహిళా శక్తికి నిలువెత్తు ప్రతీక అని కొనియాడారు. నిజాం దారుణ పాలనకు, రజాకార్ల అణచివేతకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ లాంటి వీరవనితలు బతుకమ్మను సాక్షిగా చేసుకునే పోరాటాలు చేశారని చారిత్రక అంశాలను గుర్తుచేశారు. నిజాం ప్రైవేట్ సైన్యం తెలంగాణ ఆడబిడ్డలపై చేసిన దౌర్జన్యాల రోజులను వివరిస్తూ, మన సంస్కృతే మన బలంగా నిలిచిందని పేర్కొన్నారు.



**అన్ని రంగాల్లోనూ ముందంజలో భారత నారీమణులు**

నేటి భారతదేశంలో మహిళలు అన్ని రంగాల్లోనూ అద్భుతమైన ప్రతిభను కనబరుస్తూ దేశ కీర్తిని నలుదిశలా చాటుతున్నారని కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సాధారణ గిరిజన కుటుంబం నుంచి వచ్చిన ద్రౌపది ముర్ము దేశ అత్యున్నత రాష్ట్రపతి పదవిని అలంకరించడం, తెలంగాణ కోడలు నిర్మలా సీతారామన్ కేంద్ర ఆర్థిక మంత్రిగా దేశ రక్షణ, ఆర్థిక వ్యవస్థలను నడిపించడం మనందరికీ గర్వకారణమని చెప్పారు. విమానాలు, అంతరిక్ష నౌకలు, యుద్ధ విమానాలు నడపడంతో పాటు సరిహద్దుల్లో సైనిక బలగాల్లోనూ, బహుళజాతి కంపెనీల సారథ్యంలోనూ మహిళలే ముందంజలో ఉన్నారన్నారు. ఇటీవల జరిగిన ఆసియా క్రీడల్లో భారత్ సాధించిన మెజారిటీ పతకాలు మన ఆడబిడ్డలే సాధించి త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించారని అభినందించారు.

**మహిళా సంఘాలకు కేంద్ర ప్రోత్సాహం.. డ్రగ్స్ రహిత తెలంగాణకై పిలుపు**

హైదరాబాద్ ఐటీ రంగాభివృద్ధిలోనూ మన ఆడబిడ్డలు కీలక పాత్ర పోషిస్తున్నారని, స్వయం సహాయక మహిళా సంఘాలకు (పొదుపు సంఘాలు) ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం రూ.20 లక్షల వరకు బ్యాంక్ రుణాలను అందిస్తూ స్వయం ఉపాధిని ప్రోత్సహిస్తోందని కిషన్ రెడ్డి వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించి, ఉన్నత లక్ష్యాలను సాధించేలా ప్రోత్సహించాలని సూచించారు. ఇదే సమయంలో రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ మహమ్మారి విస్తరిస్తుండటంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పంజాబ్ తరహా పరిస్థితులు తెలంగాణకు రాకుండా ఉండాలంటే తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక నిఘా పెట్టాలని కోరారు. 2029 నాటికి భారతదేశాన్ని 'నషా ముక్త భారత్'గా మార్చాలనే ప్రధాని మోదీ సంకల్పంలో భాగంగా, నవంబర్ నెలలో హైదరాబాద్‌లో రాజకీయాలకు అతీతంగా భారీ పాదయాత్ర చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ మాదకద్రవ్యాల వ్యతిరేక పాదయాత్రలో తెలంగాణ ఆడబిడ్డలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## శ్రీశైలం దేవీ శరన్నవరాత్రులకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు ఆహ్వానం



ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి దేవాలయంలో జరగనున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు హాజరు కావాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లకు దేవస్థానం ఆహ్వానం పలికింది. ఈ మేరకు దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు ఇవాళ ఉండవల్లిలో వారిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల అక్టోబర్ 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పది రోజుల పాటు ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఉత్సవాల సందర్భంగా శ్రీ భ్రమరాంబికా దేవి అమ్మవారు తొమ్మిది రోజుల పాటు నవదుర్గ అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారు. అంతేకాకుండా, ప్రతిరోజూ నవావరణ పూజలు, చండీయాగం, రుద్రయాగం, కుంకుమార్చనలు, చతుర్వేద పారాయణలు, సువాసిని-కుమారీ పూజలు వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రతిరోజూ రాత్రి వేళల్లో స్వామి అమ్మవార్లకు వివిధ వాహనాలపై గ్రామోత్సవం కన్నుల పండువగా జరుపుతారు.

అమ్మవారి అలంకారాల వివరాలు:

అక్టోబర్ 11 (ఆదివారం): శైలపుత్రి
అక్టోబర్ 12 (సోమవారం): బ్రహ్మచారిణి
అక్టోబర్ 13 (మంగళవారం): చంద్రఘంట
అక్టోబర్ 14 (బుధవారం): కూష్మాండ
అక్టోబర్ 15 (గురువారం): స్కందమాత
అక్టోబర్ 16 (శుక్రవారం): కాత్యాయని
అక్టోబర్ 17 (శనివారం): కాళరాత్రి
అక్టోబర్ 18 (ఆదివారం): మహాగౌరి
అక్టోబర్ 19 (సోమవారం): సిద్ధిదాత్రి
అక్టోబర్ 20 (మంగళవారం): నిజరూప దర్శనం (విజయదశమి)

గ్రామోత్సవంలో భాగంగా భృంగి, మయూర, రావణ, హంస, శేష, గజ, అశ్వ వాహనాలపై స్వామి అమ్మవార్లను ఊరేగిస్తారు. ఉత్సవాల చివరి రోజైన అక్టోబర్ 20న విజయదశమి సందర్భంగా పూర్ణాహుతి, ఆయుధ పూజ, శమీ పూజ కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం లక్ష్మీనరసింహ స్వామి ఆలయ సమీపంలోని పుష్కరిణిలో తెప్పోత్సవంతో ఉత్సవాలు ఘనంగా ముగుస్తాయి.




## ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం వద్దు..

గత నెలలో రాజధాని పరిధిలో రూ. 1,345 కోట్ల విలువైన పనులు పూర్తయినట్లు అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నివేదించారు. నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా చేరుకోవాలంటే పనుల వేగాన్ని మరింత పెంచాలని చంద్రబాబు సూచించారు. ప్రస్తుతం అమరావతిలో 152 ప్రాజెక్టులకు సంబంధించి సుమారు 41 వేల మంది కార్మికులు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని మంత్రి నారాయణ వివరించారు. వివిధ నిర్మాణ సంస్థలు చేపట్టిన పనుల పురోగతిని సీఎం స్వయంగా ఆరా తీశారు. రాజధాని అభివృద్ధిలో కీలకమైన ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ప్రాజెక్టు పనులను త్వరితగతిన పట్టాలెక్కించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం చోటుచేసుకోకూడదని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

## హార్ముజ్‌లో నౌకపై దాడి.. 11 మంది భారతీయ నావికులకు గాయాలు

హార్ముజ్ జలసంధిలో మరోసారి భారతీయ నావికులు ఉన్న నౌకపై దాడి జరిగింది. పనామా జెండా కలిగిన ఎంటీ ఆన్ పీస్ నౌకపై మంగళవారం ఒక ప్రొజెక్టైల్‌తో దాడి జరిగింది. ఈ దాడిలో గాయపడిన 12 మంది సిబ్బందిలో 11 మంది భారతీయులే ఉన్నట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఒమన్ తీరానికి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గాయపడిన నావికుల్ని ఒమన్ అధికారుల సహాయంతో నౌక నుంచి తరలించి ఖసబ్ ప్రాంతంలోని ఆస్పత్రికి తరలించారు. నౌకలో 17 మంది భారతీయులతో సహా మొత్తం 19 మంది సిబ్బంది ఉన్నారు. వాణిజ్య నౌకపై జరిగిన దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. భారతీయ నావికుల్ని తరలించడానికి సహకరించిన ఒమన్ అధికారులకు విదేశాంగ మంత్రిత్వ శాఖ థాంక్స్ తెలిపింది. హార్ముజ్ ప్రాంతంలో వాణిజ్య నౌకలు, పౌర మౌలిక సదుపాయాలపై కొనసాగుతున్న దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని భారత్ పేర్కొంది. అంతర్జాతీయ జలాల్లో నౌక ప్రయాణాలు, వాణిజ్య కార్యకలాపాలను పునరుద్ధరించేందుకు ఈ దాడుల్ని తక్షణమే నిలిపేయాలని పిలుపునిచ్చింది. హార్ముజ్ జలసంధి చుట్టుపక్కల ప్రాంతాల్లో వాణిజ్య నౌకలపై ఇటీవల కాలంలో దాడులు పెరిగాయి. అక్టోబర్ మొదటి వారంలోనే 7 ట్యాంకర్లు దాడులకు గురయ్యాయి. ఇరాన్-అమెరికా శాంతి చర్చలు విఫలమైన తర్వాత, అమెరికా జలసంధిని దిగ్బంధించిన నేపథ్యంలో నౌకలపై దాడులు పెరిగాయి.

## సీఎం, డిప్యూటీ సీఎం బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్..

అనంతరం ముగ్గురు నేతలు బ్రేక్‌ఫాస్ట్ చేస్తూ స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. స్థానిక ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా కూటమి పక్షాలు కలిసికట్టుగా పనిచేయాలని ఈ భేటీలో నిర్ణయించినట్లు సమాచారం. శాతం లెక్కలతో సంబంధం లేకుండా క్షేత్రస్థాయిలో ఏ పార్టీకి బలం ఉంటే వారికే సీట్లు కేటాయించాలనే అంశంపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. వైసీపీకి ఒక్క స్థానం కూడా దక్కకుండా చేయాలనే పట్టుదలతో కూటమి నేతలు ఉన్నట్లు స్పష్టమవుతోంది. తొలి దశలో జరగనున్న నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల ఎన్నికలపై ఈ చర్చలు కేంద్రీకృతమయ్యాయి. రాబోయే శుక్రవారం సుప్రీంకోర్టులో బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ విచారణకు రానున్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే ఏ క్షణంలోనైనా స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని నేతలు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి కమిటీల ఏర్పాటు ద్వారా సమన్వయంతో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు.

## భారత వాయుసేన నూతన అధిపతిగా అశుతోష్ దీక్షిత్

భారత వైమానిక దళం (ఐఏఎఫ్) నూతన అధిపతిగా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం మంగళవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన, అక్టోబర్ 31న పదవీ విరమణ చేయనున్న ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ స్థానంలో బాధ్యతలు చేపట్టనున్నారు. దీనితో ఆయన భారత వాయుసేనకు 29వ అధిపతిగా నిలవనున్నారు. నైపుణ్యం కలిగిన ఫైటర్ పైలట్ అయిన అశుతోష్ దీక్షిత్‌కు 3,500 గంటలకు పైగా యుద్ధ విమానాలను నడిపిన అపార అనుభవం ఉంది. ఆయన 1986 డిసెంబర్ 6న ఐఏఎఫ్ ఫైటర్ విభాగంలో కమిషన్ పొందారు. తన సుదీర్ఘ వృత్తి జీవితంలో మిరాజ్-2000, మిగ్ వేరియంట్లు, జాగ్వార్,



కిరణ్, హాక్, తేజస్ వంటి అనేక రకాల యుద్ధ విమానాలను నడిపారు. ఆయన క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా, ఎక్స్‌పెరిమెంటల్ టెస్ట్ పైలట్‌గా కూడా సేవలందించారు. వైస్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టడానికి ముందు, ఆయన చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌గా, సెంట్రల్ ఎయిర్ కమాండ్ చీఫ్‌గా కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆపరేషన్ సఫేద్ సాగర్, ఆపరేషన్ రక్షక్ వంటి పలు కీలక సైనిక చర్యల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా పరమ విశిష్ట సేవా పతకం (2026), అతి విశిష్ట సేవా పతకం (2023) వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి. ప్రస్తుతం భారత వాయుసేన ఆధునికీకరణ, యుద్ధ విమానాల సంఖ్య పెంపు దిశగా అడుగులు వేస్తోంది. ఈ తరుణంలో ఎయిర్ డిఫెన్స్, మానవరహిత యుద్ధ సామర్థ్యాల పెంపుదల, త్రివిధ దళాల మధ్య సమన్వయం వంటి అంశాలు ఆయన ముందున్న ప్రధాన సవాళ్లు. త్రివిధ దళాల్లో పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉన్న దీక్షిత్ నియామకం, ఈ లక్ష్యాల సాధనకు ఎంతగానో దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.



నేటి ప్రస్థానం
ప్రత్యేక కథనం



# నోటీసులు ఒకరి నుంచి..
# ఇంటి నంబర్లు మరొకరి నుంచి!

## మేడ్చల్ సర్కిల్‌లో టౌన్ ప్లానింగ్, రెవెన్యూ శాఖల తీరుపై ప్రశ్నలు

మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్లపోచంపల్లి డివిజన్ బాసిరేగడిలో అధికారుల తీరుపై తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకే ప్రాంతంలో అనుమతులు లేని నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేస్తుండగా.. అదే నిర్మాణాలకు రెవెన్యూ శాఖ నుంచి ఇంటి నంబర్లు ఎలా కేటాయించబడ్డాయన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. బాసిరేగడిలో ఓ వ్యాపారి తన వ్యాపార అవసరాల కోసం భారీ షెడ్ల నిర్మాణం చేపట్టినట్లు సమాచారం. అవసరమైన అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారంటూ టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. అయితే నోటీసులు జారీ చేసిన కొద్ది రోజులకే అదే నిర్మాణాలకు ఇంటి నంబర్లు రావడం పలు అనుమానాలకు తావిస్తోంది. టౌన్ ప్లానింగ్ శాఖ దృష్టిలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణానికి రెవెన్యూ శాఖ ఇంటి నంబర్ ఎలా కేటాయించింది? అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.



### ఒకే సర్కిల్.. రెండు రకాల చర్యలు!

ఒక శాఖ నిబంధనలకు విరుద్ధంగా ఉందని నోటీసులు ఇస్తే.. మరో శాఖ అదే నిర్మాణానికి ఇంటి నంబర్ కేటాయించడం వెనుక ఉన్న ప్రక్రియ ఏమిటన్నది అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది. ఇంటి నంబర్ కేటాయించే ముందు నిర్మాణ అనుమతులు, టౌన్ ప్లానింగ్ రికార్డులు, పన్నులు, ఇతర నిబంధనలు పరిశీలించారా? టౌన్ ప్లానింగ్ శాఖ నుంచి అభ్యంతరాలు ఉన్నప్పటికీ ఇంటి నంబర్ ఎలా మంజూరైంది? అనే ప్రశ్నలకు సమాధానాలు అవసరం.

### ప్రభుత్వ ఆదాయానికి గండి?

ఈ వ్యవహారంలో ప్రభుత్వానికి రావాల్సిన పన్నులు, రుసుములు, రాయల్టీలు తదితర ఆదాయంపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్థానికంగా వినిపిస్తున్న అంచనాల ప్రకారం సుమారు రూ.8 లక్షల వరకు ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లే అవకాశం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే దీనిపై అధికారిక లెక్కలు వెలువడాల్సి ఉంది. నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? నోటీసులు ఎందుకు జారీ చేశారు? నోటీసుల తర్వాత ఇంటి నంబర్ ఎలా వచ్చింది? ఇంటి నంబర్ కేటాయింపు సమయంలో సంబంధిత శాఖల నుంచి నివేదికలు తీసుకున్నారా? ప్రభుత్వానికి రావాల్సిన మొత్తం ఆదాయం వసూలైందా? అనే అంశాలపై ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.



### ఉన్నతాధికారుల విచారణకు డిమాండ్

ప్రజలకు నిబంధనలు ఒకటే అయితే.. ప్రభుత్వ శాఖలకు కూడా నిబంధనలు ఒకటే ఉండాలి. ఒక శాఖ అక్రమ నిర్మాణంగా గుర్తించిన నిర్మాణంపై మరో శాఖ భిన్నమైన చర్య తీసుకుంటే, మొత్తం వ్యవహారంపై రికార్డులను పరిశీలించాల్సిన అవసరం ఉంది. బాసిరేగడి వ్యవహారంలో టౌన్ ప్లానింగ్ నోటీసులు, రెవెన్యూ శాఖ ఇంటి నంబర్ రికార్డులు, నిర్మాణ అనుమతులు, పన్ను చెల్లింపులు, ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం తదితర అంశాలపై సమగ్ర విచారణ జరిపితే అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

### "ఒక శాఖకు అక్రమం.. మరో శాఖకు సక్రమం ఎలా?"

ఈ ప్రశ్నకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిబంధనలకు విరుద్ధంగా ఏదైనా జరిగి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి ప్రస్థానం
ప్రతినిధి, మేడ్చల్







# దాదా ఎంట్రీతో ఢిల్లీ క్యాపిటల్స్‌లో కీలక మార్పు.. కోచ్‌గా గంగూలీ

ఢిల్లీ క్యాపిటల్స్ కీలక మార్పు.. ఐపీఎల్-2027కు గంగూలీనే బాస్

సౌరవ్ గంగూలీని హెడ్ కోచ్‌గా నియమించిన ఢిల్లీ క్యాపిటల్స్

హేమంగ్ బదానీ స్థానంలో మాజీ కెప్టెన్ బాధ్యతలు

సహాయక సిబ్బందిలోనూ మార్పులు

ఐపీఎల్-2027 వేలం ప్రణాళికలపై గంగూలీ పర్యవేక్షణ

న్యూఢిల్లీ, అక్టోబర్ 6 (నేటి ప్రస్థానం): ఢిల్లీ క్యాపిటల్స్ వచ్చే ఐపీఎల్ సీజన్ కోసం కోచింగ్ విభాగంలో కీలక మార్పు చేసింది. భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీని ఐపీఎల్-2027 సీజన్‌కు హెడ్ కోచ్‌గా నియమించింది. ఇప్పటివరకు ఫ్రాంచైజీతో పరిపాలనా, క్రికెట్ సంబంధిత బాధ్యతల్లో ఉన్న గంగూలీకి తొలిసారిగా ఐపీఎల్ హెడ్ కోచ్ హోదా దక్కింది. 2019 నుంచి ఢిల్లీ క్యాపిటల్స్‌తో కలిసి పనిచేస్తున్న గంగూలీ గతంలో డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ పదవిలో ఉన్నాడు. పురుషుల జట్టుతో పాటు మహిళల విభాగంతోనూ ఆయన పనిచేశాడు. ఈ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని యాజమాన్యం ఇప్పుడు కోచింగ్ బాధ్యతలను అప్పగించింది. గత రెండు ఐపీఎల్ సీజన్లలో ఢిల్లీ జట్టుకు హేమంగ్ బదానీ ప్రధాన కోచ్‌గా వ్యవహరించాడు. తాజా నిర్ణయంతో ఆయన స్థానాన్ని గంగూలీ భర్తీ చేయనున్నాడు. మరోవైపు మునాఫ్ పటేల్, వేణుగోపాల్ రావు, ఇయాన్ బెల్‌లను కోచింగ్ వ్యవస్థలో కొనసాగించకూడదని ఫ్రాంచైజీ నిర్ణయించింది.కొత్త హెడ్ కోచ్ తనకు అనుకూలంగా ఉండే సహాయక బృందాన్ని ఎంపిక చేసుకునే అవకాశముంది. ఈ క్రమంలో యువరాజ్ సింగ్ కూడా గంగూలీ బృందంలో భాగమయ్యే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. దీనిపై మాత్రం అధికారికంగా ఎలాంటి ధ్రువీకరణ వెలువడలేదు. కోచ్‌గా గంగూలీకి టీ20 క్రికెట్‌లో అనుభవం ఉంది. గతేడాది దక్షిణాఫ్రికా టీ20 లీగ్‌లో ప్రిటోరియా క్యాపిటల్స్‌కు ఆయన ప్రధాన కోచ్‌గా పని చేశాడు. ఆ సీజన్‌లో జట్టు తుదిపోరుకు చేరుకుంది. ఢిల్లీకి కొత్త బాధ్యత లభించడంపై గంగూలీ స్పందిస్తూ.. ఫ్రాంచైజీతో తన అనుబంధాన్ని ప్రత్యేకంగా పేర్కొన్నాడు. జట్టులో నైపుణ్యం కలిగిన ఆటగాళ్లు ఉన్నారని, కొత్త సీజన్‌లో పోరాట పటిమతో కూడిన బలమైన జట్టును తయారు చేయడం తన ముందున్న లక్ష్యమని తెలిపాడు.కెప్టెన్ అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్ వంటి సీనియర్ ఆటగాళ్లతో గంగూలీ సమన్వయం చేసుకోనున్నాడు. 2026 ఐపీఎల్ ముగిసిన తర్వాత రిషభ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్‌లో చేరడం కూడా జట్టుకు అదనపు అనుభవాన్ని తీసుకొచ్చింది. అయితే గత రెండు సీజన్లలో ఢిల్లీ ప్రదర్శన అంతగా ఆకట్టుకోలేదు. 2026లో ఆరో స్థానంతో సరిపెట్టుకున్న జట్టు.. అంతకుముందు ఏడాది ఐదో స్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో కొత్త కోచ్ నేతృత్వంలో జట్టు వ్యూహాలు ఎలా మారతాయన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఐపీఎల్-2027 వేలానికి ముందు జట్టు కూర్పు, భవిష్యత్ వ్యూహాలపై గంగూలీ దృష్టి పెట్టనున్నాడు. వచ్చే సీజన్ తర్వాత మెగా వేలం జరగాల్సి ఉండటంతో పెద్ద మార్పులకు బదులుగా ప్రస్తుత బృందాన్ని బలోపేతం చేసే దిశగా ప్రణాళికలు ఉండే అవకాశం ఉంది. ఢిల్లీ క్యాపిటల్స్ ఛైర్మన్, సహ యజమాని పార్థ్ జిందాల్ గంగూలీ నియామకాన్ని స్వాగతించాడు. ఫ్రాంచైజీతో ఆయనకు ఉన్న దీర్ఘకాలిక అనుబంధం, క్రికెట్‌పై ఉన్న అవగాహన కొత్త పాత్రలో జట్టుకు మేలు చేస్తాయని పేర్కొన్నాడు. ఇటీవల చెన్నై సూపర్ కింగ్స్ కూడా కోచింగ్ విభాగంలో మార్పు చేసింది. జహీర్ ఖాన్‌ను ప్రధాన కోచ్‌గా నియమించడంతో దాదాపు 19 ఏళ్లుగా సీఎస్‌కేకు కోచ్‌గా ఉన్న స్టీఫెన్ ఫ్లెమింగ్ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. ఈ పరిణామాల మధ్య ఢిల్లీ కూడా గంగూలీకి పగ్గాలు అప్పగించడం ఐపీఎల్-2027కు ముందు మరో కీలక మార్పుగా నిలిచింది.

## ఈఈ నాగేశ్వర్ రావు ఆకస్మిక మృతి

### పాడే మోసిన ఎంఎల్ఏ, ఎమ్మెల్సీ



**మిర్యాలగూడ అక్టోబర్:** దామరచర్ల మండలం కేతావత్ తండాకు చెందిన రామగుండం ఇరిగేషన్ ఈఈ కేతావత్ నాగేశ్వరరావు నాయక్ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన తొలుత మిర్యాలగూడ ఎన్ఎస్పి కన్స్ట్రక్షన్ డివిజన్ లో డ్రాఫ్ట్ మెన్ విధులు నిర్వహిస్తూ ఏఇగా, డిఇఇగా పదోన్నతులు పొంది పనిచేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా నల్లగొండ, రామగుండంలో పనిచేశారు. ఆయన దహన సంస్కారాలు మంగళవారం ఆయన స్వగ్రామమైన దామరచర్ల మండలం కేతావత్ తండాలో జరిగాయి. అంతిమయాత్రలో ఎంఎల్ఏ బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ లు పాడే మోసి నాగేశ్వర్ రావు పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఆయన నిజాయితీ గల అధికారి అని, ఇరిగేషన్ శాఖలో పని చేసి మంచి అధికారిగా పేరు తెచ్చుకున్నారని చెప్పారు. వారి కుటుంబానికి ఎల్లవేళల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బంజారా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మాలోతు దశరథనాయక్, అధికారులు కిషన్ నాయక్, నాగేశ్వర్ రావు, డాక్టర్ జగేందర్, ఇఇ కేశవ్ నాయక్, గోపినాయక్, సైదా నాయక్, రమేష్ నాయక్, నానిక్యానాయక్, నాయకులు డి. స్కైల్యాబ్ నాయక్, నాగునాయక్, సిద్ధునాయక్, సీతారాం నాయక్, మాత్యునాయక్, నానినాయక్ పాల్గొన్నారు.

# గుమ్మడిదలలో అభివృద్ధి స్పీడ్.. రూ.15 కోట్ల పనులపై కీలక నిర్ణయం

- వార్డుల సమస్యలపై సర్వసభ సమావేశంలో విస్తృత చర్చ
- పారిశ్రామిక కాలుష్యం, ప్లాస్టిక్‌పై కఠిన చర్యలకు డిమాండ్
- రూ.1.90 కోట్ల అభివృద్ధి ప్రతిపాదనలకు ఆమోదం
- మంజూరైన రూ.15 కోట్ల పనులు వెంటనే చేపట్టాలని నిర్ణయం




**గుమ్మడిదల, అక్టోబర్ 6 (నేటి ప్రస్థానం):** ఒకవైపు వార్డుల్లో పేరుకుపోయిన మౌలిక వసతుల సమస్యలు.. మరోవైపు పారిశ్రామిక కాలుష్యం, ప్లాస్టిక్ వ్యర్థాలతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు. వీటన్నింటికీ పరిష్కారం చూపేందుకు గుమ్మడిదల మున్సిపాలిటీ దృష్టి సారించింది. ప్రజలకు అవసరమైన పనులను ఇకపై జాప్యం లేకుండా చేపట్టడంతో పాటు ఇప్పటికే మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని మున్సిపల్ సర్వసభ సమావేశం నిర్ణయించింది. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ అధ్యక్షతన, కమిషనర్ దశరథ్ ఆధ్వర్యంలో సర్వసభ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కౌన్సిలర్లు చర్చించారు. ప్రజలకు నేరుగా ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు.

**వార్డుల సమస్యలపై ప్రత్యేక దృష్టి**

వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాలు, విద్యుత్ స్తంభాలు, తాగునీటి పైప్‌లైన్లు వంటి మౌలిక వసతుల సమస్యలను కౌన్సిలర్లు సమావేశంలో ప్రస్తావించారు. కొన్ని ప్రాంతాల్లో పైప్‌లైన్ మరమ్మతులు, కొత్త మోటార్ల అవసరం ఉందని తెలిపారు. ఆయా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి పరిష్కరించాలని అధికారులను కోరారు. పారిశుధ్య నిర్వహణపైనా సమావేశంలో చర్చ జరిగింది. పారిశుధ్య కార్మికులకు అవసరమైన పరికరాలను అందుబాటులో ఉంచడంతో పాటు ఇంటింటి చెత్త సేకరణ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సభ్యులు సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా పారిశుధ్య పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని కోరారు.

**రూ.1.90 కోట్ల పనులకు ప్రతిపాదనలు**

మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి సుమారు రూ.1.90 కోట్ల మేర ప్రతిపాదనలపై సమావేశంలో చర్చించారు. అందుబాటులో ఉన్న నిధులను అవసరమైన ప్రాంతాలకు మళ్లించి ప్రజలకు తక్షణ ప్రయోజనం కలిగే పనులను ముందుగా పూర్తి చేయాలని నిర్ణయించారు. అభివృద్ధి పనుల్లో వేగంతో పాటు నాణ్యత కూడా ముఖ్యమని చైర్మన్ అధికారులకు సూచించారు. కేవలం పనులు ప్రారంభించడం కాకుండా అవి ప్రజలకు ఉపయోగపడేలా ప్రమాణాలతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**పారిశ్రామిక కాలుష్యంపై ఫోకస్**

బొంతపల్లి పారిశ్రామిక ప్రాంతం నుంచి వస్తున్న కాలుష్యం కూడా సమావేశంలో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చింది. పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం కారణంగా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ్యులు తెలిపారు. ఈ సమస్యపై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేసి, క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి ఇబ్బంది కలిగించే అంశాలపై సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సభ్యులు అభిప్రాయపడ్డారు.

**ప్లాస్టిక్ వినియోగంపై నియంత్రణ**

మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సమావేశంలో సూచించారు. నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై పర్యవేక్షణ పెంచడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించాలని నిర్ణయించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు డ్రైనేజీల్లో చేరి సమస్యలను మరింత తీవ్రం చేస్తున్న నేపథ్యంలో ప్రజల భాగస్వామ్యంతో నియంత్రణ చర్యలు చేపట్టాలని సభ్యులు సూచించారు.

**రైతుల సమస్యలపైనా చర్చ**

మున్సిపాలిటీ పరిధిలోని రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా వంటి పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలను కూడా సమావేశంలో ప్రస్తావించారు. అర్హులైన రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా అధికారులు చొరవ తీసుకోవాలని చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ కోరారు. రైతులకు సంబంధించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు కూడా సహకరించాలని ఆయన సూచించారు.

**రూ.15 కోట్ల పనులపై ఇక ఆలస్యం వద్దు**

గుమ్మడిదల మున్సిపాలిటీకి మరో కీలక అంశం రూ.15 కోట్ల అభివృద్ధి నిధులు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసిన ఈ నిధులతో చేపట్టాల్సిన పనులు కొన్ని ఇంకా ప్రారంభం కాకపోవడంపై సమావేశంలో చర్చ జరిగింది. నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ కొంతమంది కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ముందుకు రాకపోవడంతో జాప్యం జరుగుతోందని సభ్యులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్లతో అధికారులు మాట్లాడి పనులు త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మంజూరైన నిధులు ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉండకుండా, అవసరమైన చోట పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలని సమావేశం నిర్ణయించింది. ముఖ్యంగా ప్రజలు నిత్యం ఎదుర్కొనే రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, పారిశుధ్య సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

**సమన్వయంతోనే సమస్యలకు పరిష్కారం**

మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు ముందుకు సాగాలంటే ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని చైర్మన్ పేర్కొన్నారు. కౌన్సిలర్లు తమ వార్డుల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడంతో పాటు వాటి పరిష్కారాన్ని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

మొత్తంగా.. గుమ్మడిదల మున్సిపాలిటీలో పెండింగ్ సమస్యలకు పరిష్కారం చూపడం, కొత్త అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం, ఇప్పటికే మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవడంపై సమావేశం దృష్టి పెట్టింది. రూ.15 కోట్ల పనులు వేగంగా పట్టాలెక్కితే మౌలిక వసతుల విషయంలో ప్రజలకు కొంత ఊరట లభించే అవకాశం ఉంది. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్యతో పాటు వివిధ శాఖల అధికారులు, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.







# ఓటర్ల జాబితాలో ఈ 122 పేర్లే ఎందుకు? ఒవైసీ

- గోషామహల్‌లో 122 ఫామ్-7 దరఖాస్తులపై ఒవైసీ అభ్యంతరం
- ముస్లిం ఓటర్ల పేర్ల తొలగింపునకు కుట్ర జరుగుతోందని ఆరోపణ
- తప్పుడు దరఖాస్తులపై కేసులు పెట్టాలని డిమాండ్
- ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించాలని విజ్ఞప్తి

**హైదరాబాద్, అక్టోబర్ 6 (నేటి ప్రస్థానం):** ఓటర్ల జాబితా సవరణ సందర్భంగా వెలుగుచూసిన కొన్ని ఫామ్-7 దరఖాస్తులపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నలు లేవనెత్తారు. గోషామహల్ నియోజకవర్గంలో 122 మంది ఓటర్ల పేర్లను తొలగించేందుకు ముందే ముద్రించిన దరఖాస్తులు ఉపయోగించారని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై ఎన్నికల సంఘం కఠినంగా వ్యవహరించాలని కోరారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఒవైసీ.. గోషామహల్‌లోని పలు బూత్‌లకు సంబంధించి ఫామ్-7 దరఖాస్తుల వ్యవహారాన్ని ప్రస్తావించారు. ముఖ్యంగా 28వ పోలింగ్ స్టేషన్‌కు సంబంధించిన 122 మంది ఓటర్ల పేర్లను తొలగించేందుకు ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. ఆ పేర్లలో ముస్లిం ఓటర్లు ఉన్నారని చెప్పారు.ఎన్నికల జాబితాలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఓటర్ల పేర్లను తొలగించేందుకు



దరఖాస్తులు ఎలా వచ్చాయనే దానిపై స్పష్టత ఇవ్వాలని ఒవైసీ డిమాండ్ చేశారు. ఒక వ్యక్తి ఇంత పెద్ద సంఖ్యలో అభ్యంతరాలు ఎలా సమర్పించారో తేల్చాలని కోరారు. తప్పుడు పత్రాలు లేదా తప్పుడు ప్రకటనలతో ఫామ్-7లు సమర్పించినట్లు నిర్ధారణ అయితే కేసులు నమోదు చేయాలని అన్నారు. ఇదిలా ఉండగా, గోషామహల్‌లో సమర్పించిన కొన్ని ఫామ్-7లకు దరఖాస్తుదారుల సంతకాలు లేకపోవడంతో వాటిని అధికారులు పరిగణనలోకి తీసుకోలేదని ఎన్నికల అధికారులు వెల్లడించారు. మరోవైపు బీజేపీ ఈ ఆరోపణలను ఖండించింది. తమ పార్టీకి చెందిన బూత్ స్థాయి ఏజెంట్లు ఇలాంటి ఫామ్‌లను భారీగా సమర్పించలేదని స్పష్టం చేసింది. ఫామ్-7 ద్వారా ఓటర్ల పేర్ల తొలగింపుపై వస్తున్న ఫిర్యాదులను నిబంధనల ప్రకారం పరిశీలించాలని తెలంగాణ ఎన్నికల అధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. తప్పుడు వివరాలు ఉద్దేశపూర్వకంగా ఇచ్చినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గోషామహల్ ఘటనపై పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక



## విరాట్ కోహ్లీకి రూ.5 కోట్లు ఇచ్చారా?

ప్రేమానంద్ ఆశ్రమ సందర్శనపై వివాదం

ప్రేమానంద్ ఆశ్రమ సందర్శనకు కోహ్లీకి రూ.5 కోట్లు చెల్లించారంటూ ఆరోపణలు

దినేశ్ శర్మ పేరుతో ఉన్న లేఖలో ఆరోపణలు చేసినట్లు సమాచారం

2023 నుంచి కోహ్లీ దంపతులు ఆశ్రమాన్ని పలుమార్లు సందర్శించిన వైనం

ఈ ఆరోపణలను రుజువు చేసేందుకు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టీకరణ

ఈ వివాదంపై ఇప్పటివరకు స్పందించని కోహ్లీ, అనుష్క దంపతులు

బృందావన్, అక్టోబర్ 6 (నేటి ప్రస్థానం): విరాట్ కోహ్లీ, అనుష్క శర్మలు ప్రేమానంద్ మహరాజ్‌ను కలిసిన పర్యటనలపై సోషల్ మీడియాలో కొత్త చర్చ మొదలైంది. ఆశ్రమానికి వచ్చినందుకు కోహ్లీకి భారీ మొత్తంలో డబ్బు అందిందనే ఆరోపణలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. అయితే అందులో పేర్కొంటున్న రూ.5 కోట్ల మొత్తానికి సంబంధించి ఇప్పటివరకు నిర్ధారిత సమాచారం లేదు. శ్రీకృష్ణ జన్మభూమి సంఘర్ష్ న్యాస్ అధ్యక్షుడు దినేశ్ శర్మ పేరుతో ప్రచారంలోకి వచ్చిన లేఖ ఈ వివాదానికి కేంద్రంగా మారింది. యోగి ఆదిత్యనాథ్‌కు పంపినట్లు చెబుతున్న ఆ లేఖలో కోహ్లీని ఆశ్రమానికి తీసుకురావడం వెనుక ప్రత్యేక ప్రచార ఉద్దేశం ఉందని ఆరోపించినట్లు తెలుస్తోంది. రాజస్థాన్‌కు చెందిన ఒక ప్రైవేట్ కంపెనీ లేదా రియల్ ఎస్టేట్ వర్గాలకు చెందిన వ్యక్తులు పర్యటన కోసం నిధులు అందించారనే ఆరోపణలు కూడా అందులో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. 2023 జనవరిలో కోహ్లీ తొలి ఆశ్రమ పర్యటన కూడా ఈ నేపథ్యంలోనే జరిగిందని లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. కోహ్లీ కుటుంబం ఆశ్రమాన్ని సందర్శించిన విషయం మాత్రం గతంలోనే బహిరంగంగా తెలిసింది. 2023లో తొలిసారి అక్కడికి వెళ్లిన కోహ్లీ, అనుష్క తమ కుమార్తె వామికతో కలిసి ప్రేమానంద్ మహరాజ్‌ను కలిశారు. ఆ తర్వాత 2025, 2026లోనూ వారి భేటీలు జరిగాయి. ఆ సందర్భాలకు సంబంధించిన వీడియోలు, చిత్రాలు సోషల్ మీడియాలో విస్తృతంగా కనిపించాయి. అయితే రూ.5 కోట్లు చెల్లించినట్లు నిరూపించే ఆర్థిక పత్రాలు, బ్యాంకు వివరాలు, ఒప్పందాలు లేదా రశీదులు ఏవీ వెలుగులోకి రాలేదు. విరాట్ కోహ్లీ, అనుష్క శర్మ కూడా దీనిపై ఎలాంటి ప్రత్యక్ష ప్రకటన చేయలేదు. అందువల్ల ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న రూ.5 కోట్ల అంశాన్ని నిర్ధారిత వాస్తవంగా చెప్పడానికి ఆధారాలు లేవు.

## సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజనని మర్యాదపూర్వకంగా కలిసిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్....




సైబరాబాద్ : సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన ను జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, పార్కుల అభివృద్ధి, తదితర మున్సిపల్ సమస్యలపై చర్చించారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నవీన్ యాదవ్ గారు కమిషనర్ ని కోరారు. ముఖ్యంగా వర్షాకాలం నేపథ్యంలో జూబ్లీహిల్స్, బోరబండ, ఎర్రగడ్డ, వెంగల్ రావు నగర్, రహమత్ నగర్ తదితర ప్రాంతాల్లో నీటి నిల్వ, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నియోజకవర్గంలో చేపట్టాల్సిన నూతన అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించి ప్రతిపాదనలను కమిషనర్ కి అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మున్సిపల్ కమిషనర్ సృజన గారు, నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఈ మర్యాదపూర్వక భేటీలో ఎమ్మెల్యే వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భానూరుకు బీడీఎల్ అండ..

## 25 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులపై ఎమ్మెల్యే కీలక డిమాండ్

భానూరు అభివృద్ధి పనులకు సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే జీఎంఆర్ విజ్ఞప్తి

కంచర్లగూడెం పాఠశాల, శ్మశానవాటిక, రహదారి అభివృద్ధికి నిధులు కోరిన ఎమ్మెల్యే

25 ఏళ్లుగా పనిచేస్తున్న స్థానిక కార్మికులను తొలగించొద్దని బీడీఎల్ యాజమాన్యానికి విజ్ఞప్తి

సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఈడీ హామీ





**గుమ్మడిదల(పటాన్‌చెరు), అక్టోబర్ 6:** ఒకవైపు గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు.. మరోవైపు ఏళ్ల తరబడి పరిశ్రమను నమ్ముకుని పనిచేస్తున్న స్థానిక కార్మికుల భవిష్యత్.. ఈ రెండు అంశాలను ముందుకు తీసుకెళ్లేలా భానూరు అభివృద్ధిపై ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కీలకంగా స్పందించారు. గ్రామ అవసరాలకు బీడీఎల్ సంస్థ తన సీఎస్ఆర్ నిధుల ద్వారా చేయూత అందించాలని కోరుతూ సంస్థ ఉన్నతాధికారులతో చర్చించారు. మంగళవారం బీడీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంపత్‌కుమార్‌ను భానూరు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే జీఎంఆర్ కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై ప్రధానంగా చర్చించారు.

**గ్రామానికి అవసరమైన పనులపై ప్రత్యేక దృష్టి**

భానూరు పరిసర ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా కంచర్లగూడెం ప్రాథమిక పాఠశాలకు నూతన భవనం నిర్మించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే శ్మశానవాటిక అభివృద్ధి, భానూరు--కంచర్లగూడెం మధ్య బీటీ రహదారి మరమ్మతులకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గ్రామ ప్రజలకు నేరుగా ఉపయోగపడే ఈ పనులకు బీడీఎల్ సీఎస్ఆర్ నిధులను వినియోగించాలని ఎమ్మెల్యే సూచించారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు వాటి పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజల అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన బాధ్యత ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

**25 ఏళ్ల సేవకు గుర్తింపు ఇవ్వాలి**

సమావేశంలో భానూరుకు చెందిన స్థానిక కార్మికుల సమస్యను ఎమ్మెల్యే ప్రస్తావించారు. బీడీఎల్‌లో భానూరుకు చెందిన పలువురు కార్మికులు సుమారు 25 ఏళ్లుగా సేవలందిస్తున్నారని తెలిపారు. ఇన్నేళ్లుగా సంస్థతో అనుబంధం కొనసాగిస్తున్న స్థానిక సిబ్బందికి భద్రత కల్పించాలని కోరారు. దీర్ఘకాలంగా పనిచేస్తున్న కార్మికులను తొలగించి వారి స్థానంలో కాంట్రాక్ట్ సిబ్బందిని తీసుకునే పరిస్థితి రాకుండా చూడాలని బీడీఎల్ యాజమాన్యాన్ని కోరారు. ఏళ్ల తరబడి సంస్థకు సేవలందించిన వారి అనుభవాన్ని, స్థానికంగా వారి కుటుంబాల పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

**ఈడీ నుంచి సానుకూల స్పందన**

ఎమ్మెల్యే చేసిన విజ్ఞప్తిపై బీడీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంపత్‌కుమార్ సానుకూలంగా స్పందించినట్లు జీఎంఆర్ తెలిపారు. భానూరు అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు కేటాయించడంతో పాటు అవసరమైన పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఈడీ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు అందుబాటులోకి రావడంతో పాటు స్థానికంగా పనిచేస్తున్న కార్మికులకు న్యాయం జరిగితే భానూరు ప్రజలకు రెండు విధాలుగా ప్రయోజనం కలుగుతుందని స్థానిక నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు దశరథరెడ్డి, వెంకటరెడ్డి, వార్డు సభ్యులు ప్రవళిక నరేందర్, రవీందర్‌రెడ్డి, నితీష మాణిక్యం, శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాస్, పాండు, ముత్తిరెడ్డి, తిరుపతి, శివయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

# మద్యం ధరలపై భారం.. బార్ యజమానులకు మాత్రం నష్టం లేదన్న మంత్రి జూపల్లి

ప్రివిలేజ్ ఫీజు వల్ల బార్ యాజమాన్యాలకు నష్టం ఉండదని మంత్రి స్పష్టం

ధరల్లో కొంత మార్పు మద్యం వినియోగదారులపై ప్రభావం చూపుతుందని వెల్లడి

హైదరాబాద్‌లో ఇతర రాష్ట్రాల విధానాలకు అనుగుణంగా లైసెన్సులు ఇస్తున్నామన్న జూపల్లి

మద్యం విక్రయాల ద్వారా రాష్ట్రానికి రూ.40 వేల కోట్ల ఆదాయం వస్తోంది: జూపల్లి కృష్ణారావు




**హైదరాబాద్, అక్టోబర్ 6 (నేటి ప్రస్థానం):** బార్లు, రెస్టారెంట్లకు సంబంధించిన కొత్త ప్రివిలేజ్ ఫీజుపై తెలంగాణ ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేసింది. ఈ రుసుము అమలైతే వ్యాపార నిర్వాహకులపై అదనపు ఆర్థిక భారం పడదని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. అయితే మద్యం ధరల ద్వారా కొనుగోలుదారులపై స్వల్ప ప్రభావం ఉండవచ్చని పేర్కొన్నారు. ఫీజు విధానాన్ని వ్యతిరేకిస్తూ బార్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ చేపట్టిన ఆందోళనపై మంత్రి స్పందించారు. హైదరాబాద్ నగరం విస్తరిస్తూ అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో దేశంలోని ఇతర ప్రాంతాల్లో అమలవుతున్న విధానాలను అనుసరిస్తూ బార్ లైసెన్సులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. మద్యం ధరలు పెరిగినంత మాత్రాన విక్రయాలు గణనీయంగా తగ్గిపోవని జూపల్లి పేర్కొన్నారు. ధరల సవరణ ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో పెరుగుదల కనిపిస్తుందని గత పరిణామాలు సూచిస్తున్నాయని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో మద్యం ఆదాయం రూ.10 వేల కోట్ల నుంచి రూ.36 వేల కోట్లకు పెరిగిందని మంత్రి వివరించారు. ఈ పెరుగుదల దాదాపు 260 శాతంగా ఉందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ ఆదాయం సుమారు రూ.40 వేల కోట్లకు చేరినట్లు తెలిపారు. ఎక్సైజ్ శాఖకు సంబంధించిన నిర్ణయాలను ప్రభుత్వం చట్టబద్ధమైన విధానంలోనే అమలు చేస్తోందని జూపల్లి పేర్కొన్నారు. మద్యం తయారీకి అవసరమైన నీటి విషయంలో రాష్ట్రంలో ఎలాంటి కొరత లేదని చెప్పారు. ప్రివిలేజ్ ఫీజు అంశంలో బార్ యజమానులకు నష్టం జరగదని మరోసారి స్పష్టం చేశారు.

## విద్యార్థులు, యువత ప్రధాని మోదీని ఆదర్శంగా తీసుకోవాలి...

కైతాపురం జితేందర్....

సైబరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ 25 వసంతాల ప్రజా సేవను పురస్కరించుకుని బీజేపీ సేవా సంకల్ప్ అభియాన్ - 2026 కార్యక్రమంలో భాగంగా హఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ ఆధ్వర్యంలో అంబేద్కర్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో "నా కలలోని భారత్" అంశంపై చిత్రలేఖనం, ఎస్సే రైటింగ్ పోటీలు నిర్వహించారు. హఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు కైతాపురం జితేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విజేతలకు బహుమతులు, పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ కార్యదర్శి మాణిక్ రావు మాట్లాడుతూ - ప్రధాని మోదీ జీవితమంతా ప్రజా సేవకే అంకితమని, స్వయం సేవక్ గా, గుజరాత్ సీఎం గా, ప్రధానిగా ప్రజా శ్రేయస్సు కోసం కృషి చేశారని, యువత, విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షులు విజేందర్ సింగ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు అళ్ల వరప్రసాద్, బీజేపీ నాయకులు శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శి జగన్ గౌడ్, అఖిల్ యాదవ్, రాజశేఖర్, కిరణ్ కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## హస్తినాపురం లో ట్రాన్స్‌ఫార్మర్ పేలుడు బీజేపీ నాయకుల తక్షణ స్పందన



ఎల్ బి నగర్ :- హస్తినాపురం నార్త్ ఎక్స్టెన్షన్ చౌరస్తాలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కస్తూరి కాలనీలోని నర్సింగ్ కళాశాలకు చెందిన బస్సు ఢీకొనడంతో ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న విద్యార్థులకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో ఆయిల్ మొత్తం రోడ్డుపై పడటంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న వెంటనే బీజేపీ నాయకులుబైరామల్‌గూడ డివిజన్ బీజేపీ అధ్యక్షులు ఎరుకల మల్లేష్ గౌడ్, స్పందించి, కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డితో కలసి విద్యుత్ శాఖ ఏఈ పర్వత కి ఫోన్ చేసి సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభించారు. అదేవిధంగా రోడ్డుపై పడిన ఆయిల్ వల్ల వాహనాలు జారిపడే ప్రమాదం ఉండటంతో, అక్కడ మట్టి పోయించి ప్రమాద నివారణకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, కళాశాల యాజమాన్యం తమ బస్సులను అత్యంత జాగ్రత్తగా నడిపించాలని, ప్రజల భద్రతకు ఎలాంటి ప్రమాదం కలగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ కార్యవర్గ సభ్యులు బుర్రం ప్రకాష్ మరియు ఇతరులు పాల్గొన్నారు.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక



## రాజభవనంలో నర్తకీమణి

'ఎస్ఆర్ కళ్యాణమండపం' ఫేం శ్రీధర్ గాదె దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతున్నది. వెంకట్ తలారి నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఈశ్వర్ రాచిరాజు, నందు, నిఖిత ప్రధానపాత్రధారులు. పూజిత పొన్నాడ, సింధు కాసారం ఇతర పాత్రధారులు. ఈసినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఇందులో నర్తకి పాత్రను పూజిత పొన్నాడ పోషిస్తున్నది. ఈ సినిమాలోని ఆమె పాత్రకు చెందిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. రాజభవనంలో నర్తకీమణిగా మస్తాబైన పూజిత పొన్నాడను ఈ పోస్టర్‌లో చూడొచ్చు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే హారర్ సినిమా ఇదని, సరికొత్త కథ, కథనాలతో సినిమా ఆకట్టుకుంటుందని, ఈ సినిమాకు సంబంధించిన టైటిల్, ఇతర వివరాలు త్వరలో తెలియజేస్తామని మేకర్స్ చెప్పారు.



## శ్రీకాంత్ రిలీజ్ చేసిన 'మ్యాజిక్ మూవ్‌మెంట్స్' ఫస్ట్ లుక్

శ్రీ అన్నపూర్ణ క్రియేషన్స్ బ్యానర్, శ్రీ లక్ష్మీ శ్రీనివాస బ్యానర్‌లపై , ప్రముఖ దర్శకుడు కె.దశరథ్ సమర్పణలో తల్లాడ సాయికృష్ణ నటిస్తూ దర్శకత్వం వహించిన సినిమా 'మ్యాజిక్ మూవ్‌మెంట్స్'. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను ప్రముఖ హీరో శ్రీకాంత్ రీసెంట్‌గా విడుదల చేశారు. ఈ కార్యక్రమం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ.. "మ్యాజిక్ మూవ్‌మెంట్స్" టైటిల్ చాలా డిఫరెంట్‌గా ఉంది, టైటిల్‌కు తగ్గట్టుగానే వీరికి కూడా మ్యాజిక్ జరగాలని కోరుకుంటున్నానని హీరో శ్రీకాంత్ అన్నారు. అలాగే సినిమా మంచి విజయం సాధించి చిత్రంలోని ప్రతి ఒక్కరికీ మంచి పేరు తీసుకురావాలని, చిత్ర బృందంలోని అందరికీ తన శుభాకాంక్షలు తెలిపారు.



## 'బ్లడీ రోమియో'లో నాయికగా?

'ది ప్యారడైజ్' చిత్రంతో బ్లాక్‌బస్టర్ హిట్‌ని దక్కించుకున్న హీరో నాని తదుపరి సినిమా 'బ్లడీ రోమియో' కోసం సిద్ధమవుతున్నారు. సుజీత్ దర్శకత్వంలో స్టైలిష్ గ్యాంగ్‌స్టర్, రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కనుంది. త్వరలో ఈ సినిమా పట్టాలెక్కనుంది. ప్రస్తుతం కథానాయిక అన్వేషణలో ఉన్న చిత్రబృందం పలువురు అగ్ర హీరోయిన్ల పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. మీనాక్షి చౌదరి పేరు ప్రముఖంగా వినిపించింది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో ప్రీతి ముకుందన్ కథానాయికగా ఖరారైందని తెలిసింది. దర్శకుడు సుజీత్ డిజైన్ చేసిన పాత్రకు ఆమె పర్‌ఫెక్ట్ ఛాయిస్ అవుతుందని భావించిన మేకర్స్ ఆమె వైపే మొగ్గు చూపిస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ విషయంలో మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 'కన్నప్ప' చిత్రంతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకుంది ప్రీతి ముకుందన్. ఈ మధ్యకాలంలో బ్లాస్ట్, ఇదయం మురళీ వంటి తమిళ చిత్రాలతో విజయాలను తన ఖాతాలో వేసుకున్నది. ఒకవేళ 'బ్లడీ రోమియో'లో ఆమె కథానాయికగా ఖరారైతే తెలుగులో ఈ భామ కెరీర్‌కు మరింత ఊపునిస్తుందని అభిమానులు భావిస్తున్నారు.



## సంఘర్షణతో జైలర్ ప్రపంచం

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సూపర్‌స్టార్ రజనీకాంత్ 'జైలర్ 2' సినిమా ట్రైలర్ వచ్చేసింది. తెలుగులోనూ విడుదలైన ఈ ట్రైలర్ హై వోల్టేజ్ యాక్షన్‌తో రజనీ మార్క్ స్టైల్, కామెడీ, యాటిట్యూడ్‌తో ప్రేక్షకుల్లో అంచనాలు పెంచింది. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తనదైన శైలిలో 'జైలర్' ప్రపంచాన్ని మరింత భారీగా, మరింత ఆసక్తికరంగా తీర్చిదిద్దినట్టు ట్రైలర్ చెబుతున్నది. జైలర్ ముత్తువేల్ పాండియన్‌గా తలైవా మరోసారి తనదైన స్టైల్, మాస్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. ఈ సీక్వెల్ మరింత సంఘర్షణలతో, భారీ సవాళ్లతో విస్తృతమైన ప్రపంచాన్ని ఆవిష్కరించనున్నదని మేకర్స్ చెబుతున్నారు. మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్ ప్రత్యేక పాత్రలు పోషించిన ఈ చిత్రంలో రమ్యకృష్ణ, విద్యాబాలన్ కథానాయికలు. ఎస్.జె.సూర్య, యోగిబాబు, సూరజ్ వెంజారమూడు ఇతర పాత్రధారులు. సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ తెలుగులో విడుదల చేయనున్నది. ఈ నెల 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి కెమెరా: కార్తీక్ కన్నన్, సంగీతం: అనిరుధ్ రవిచంద్రన్.

## 'కాకా' మూవీ.. కీలక పాత్రలో బాలీవుడ్ నటుడు

చిరంజీవి ప్రధాన పాత్రలో, దర్శకుడు బాబీ తెరకెక్కిస్తున్న చిత్రం 'కాకా'. ఈ సినిమా 2027 జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో చిరంజీవి 'కదిరి కాళిదాస్'గా కనిపించనున్నారు. అయితే తాజాగా మేకర్స్ ఈ సినిమా నుంచి ఓ ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. ఈ చిత్రంలో బాలీవుడ్ దర్శక, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేశారు. దర్శకుడు బాబీ ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు.'ఓ పవర్‌ఫుల్ పాత్ర కోసం ప్రముఖ దర్శక, నటుడు అనురాగ్ కశ్యప్‌ను 'కాకా' చిత్రబృందం ఎంపిక చేసింది. ఈ సినిమాలో ఆయన అత్యంత కీలకమైన పాత్రలో కనిపించనున్నారు' అని ఆయన పేర్కొన్నారు.






## నాకు మోసపోవడం కొత్తేటి కాదు.. ట్రైలర్ రిలీజ్

ఉత్తరాంధ్ర ప్రజలకు గరివిడి లక్ష్మి అనే వ్యక్తి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. బుర్రకథ కళాకారిణిగా అద్భుతమైన గుర్తింపు తెచ్చుకుంది. ఈమె పాటలు అప్పట్లో ఎంతలా ఆకట్టుకున్నాయో తెలిసిందే. ఈమె జీవితం ఆధారంగా తెలుగులో తీసిన సినిమా 'గరివిడి లక్ష్మి'. ఆనంది టైటిల్ రోల్ చేసింది. గౌరీనాయుడు జమ్ము దర్శకుడు. ఈ నెల 17న మూవీ థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ క్రమంలోనే తాజాగా ట్రైలర్ వదిలారు. ఉత్తరాంధ్ర జానపద కళల వైభవాన్ని, గ్రామీణ మహిళ పోరాట పటిమని ఈ సినిమాలో చూపించబోతున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ నిర్మించింది. ఆనందితో పాటు రాగ్ మయూర్, నరేష్, శరణ్య ప్రదీప్, రాశి తదితరులు కీలక పాత్రలు చేశారు. 90స్ లో ఏకంగా 10 వేలకు పైగా ప్రోగ్రామ్స్ చేసి గుర్తింపు తెచ్చుకున్న గరివిడి లక్ష??మి జీవిత కథను ఈ ట్రైలర్‌లో శాంపిల్‌గా చూపించారు. అక్టోబర్ 16న జైలర్ 2, రణబాలి సినిమాలు రిలీజ్ అవుతున్న నేపథ్యంలో గరివిడి లక్ష్మి చిత్రం.. ప్రేక్షకుల దృష్టిని ఏ మేరకు ఆకర్షిస్తుందో చూడాలి?

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAl, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/